

ఇంటి వద్దే కూల్‌గా..
వేసవిలో ఆరోగ్య రక్షణకు ఇంటి వద్దే పానీయాలు, జ్యూస్‌లు తయారు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. - 8లో



నెమలికి నేర్పిన నడకలివి
కాణిపాకం ఆస్థాన మండపంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు రంజింపజేశాయి. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	40	26
తిరుపతి	40	27
తిరుమల	36	23
గూడూరు	42	28
నగరి	42	28

న్యూస్‌రీల్

భక్తజన బోయకొండ



విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. తెల్లవారు జామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కోర్కెలు తీరిన భక్తులు పిండి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. అవసరమైన సౌకర్యాలను ఈఓ చంద్రమౌళి కల్పించారు. ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలు భక్తుల రద్దీతో సందడిగా మారాయి.



ఆలయంలో భక్తుల రద్దీ

కబడ్డీ జాతీయ పోటీలకు ఎంపిక



ముబారక్

చౌడేపల్లె: కబడ్డీ జాతీయ స్థాయి పోటీలకు చౌడేపల్లె మండలం దాదేపల్లెకు చెందిన సలీంసాబ్ కుమార్తె ముబారక్ ఎంపికైనట్లు కోచ్ రామచంద్ర తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ బాలిక పలమనేరులోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిందని తెలిపారు. ఈనెల 20, 21 తేదీల్లో విజయనగరం జిల్లా డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన అండర్–19 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ జట్టుకు ఎంపిక అయినట్లు తెలిపారు. జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు. బాలికను కోచ్‌లు వెంకటేష్, రాజేంద్ర అభినందించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందనలో ప్రజలు తమ వినతులు అందజేయవచ్చని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు తప్పని సరిగా స్పందనకు హాజరు కావాలని తెలిపారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడవచ్చని పేర్కొన్నారు.

జిల్లాలో భారీ వర్షం



పలమనేరులో కురుస్తున్న వర్షం

చిత్తూరు రూరల్/పలమనేరు: జిల్లాలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. పలుప్రాంతాల్లో చెట్లు కూలాయి. మామిడి పంటకు నష్ట వాటిల్లింది. చిత్తూరు నగరంలో పలు రోడ్లు జలమయమయ్యాయి. చిత్తూరు మండలంలో ఐదు గంటలకు పైగా కరెంటుకు అంతరాయం ఏర్పడింది. ఐరాల మండలం వినాయకపురంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి పూర్తిగా కాలిపోయింది. పలమనేరు పట్టణంలో గంటపాటు పడిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. ముఖ్యంగా లక్ష్మీనగర్ కాలనీలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్ వద్ద వరదనీరు చెరువును తలపించింది. ఇక్కడికి చెందిన కొందరు వర్షపునీటిని వెళ్లే దారులు మూసివేసి కట్టడాలను నిర్మించడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో పలు కాలనీలకు వెళ్ళే వారికి దారి లేకుండా పోయింది. ఆర్టీసీ బస్టాండు, చెరువు కట్ట లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. కరెంటు వైర్లు తెగి రెండు గంటల పాటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా, ఈ వర్షంతో దుక్కుల దున్నేందుకు అదునుగా మారిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు రూరల్, గంగాధరనెల్లూరు మండలాల్లో కాపు దశలో ఉన్న మామిడి నేలరాలింది.

తీరం.. వసతుల హారం

కనుచూపు మేర అనంత జలాలు.. మెత్తటి ఇసుక తిన్నెలు.. సరుగుడు తోటల సవ్వడులు.. హాయి గొలిపే చల్లటి గాలులు.. ఎగసిపడే కెరటాలతో సాగర తీరం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆహ్లాదకర వాతావరణాన్ని సందర్శకులు ఆస్వాదించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. ప్రకృతి రమణీయతకు తోడుగా అత్యాధునిక వసతులు కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా తొలుత జిల్లాలోని 8 బీచ్‌లను గుర్తించింది. ఆయా ప్రాంతాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పర్యాటక ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు అధికార యంత్రాంగం పకడ్బందీగా కసరత్తు చేస్తోంది. త్వరలోనే సముద్ర తీరం.. సకల సౌకర్యాలతో స్వర్గధామంగా కనువిందు చేయనుంది.



తూపిలిపాళెం బీచ్‌లో పర్యాటకుల సందడి (ఫైల్)

- జిల్లాలో 8 బీచ్‌ల అభివృద్ధికి ప్రణాళిక
- నివేదికలు సిద్ధం చేస్తున్న టూరిజం శాఖ
- పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా అడుగులు
- సకల వసతులు కల్పించేందుకు సన్నాహాలు
- భూ కేటాయింపునకు కసరత్తు చేస్తున్న అధికారులు

ఏపీ నెట్‌వర్క్ : తిరుపతి జిల్లాలో చిల్లకూరు మండలం నుంచి తడ వరకు సుమారు 75 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. పొరుగునే ఉన్న పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో కృష్ణపట్నం పోర్టు ఉండగా, వాకాడు మండలంలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన లైట్ హౌస్ ఠీవిగా నిలబడి ఉంది. సూళ్లూరుపేట, తడ మండలాల పరిధిలో పులికాట్ సరస్సు పర్యాటక కేంద్రంగా ఆకట్టుకుంటోంది. అలాగేగ దొరవారిసత్రంలోని నేలపట్టు పక్షుల కేంద్రం ఎల్లప్పుడూ సందర్శకులతో సందడిగా ఉంటుంది. సమీపంలోని భీములవారిపాళెంలో పడవలో విహార యాత్ర చేసే వసతిని టూరిజం శాఖ కల్పించింది. ఇలా తీర ప్రాంతంలో ఏడాది పొడవునా పర్యాటకులకు ఆహ్లాదం పంచే ప్రాంతాలు విశేషంగా ఉన్నాయి. ఈ క్రమంలోనే పలు బీచ్‌లను కూడా అభివృద్ధి చేసి మరింతగా సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం పకడ్బందీగా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

అభివద్ధికి కసరత్తు

పర్యాటకులను ఆకర్షించే క్రమంలో పర్యాటక శాఖ జిల్లాలోని 8 బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ముందుగా వాకాడు మండలంలోని తూపిలిపాళెం, కోట మండలంలోని శ్రీనివాససత్రం బీచ్‌లను సకల వసతులతో తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఇటీవల టూరిజం శాఖకు చెందిన అధికారులు ఆయా బీచ్‌లను సందర్శించారు. అక్కడి స్థితి గతులను పరిశీలించి నివేదికలను సైతం సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జాయింట్ కలెక్టర్ బాలాజీ, గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ సైతం ఇటీవలే తూపిలిపాళెంలో పర్యటించారు. అభివృద్ధి పనులకు అవసరమైన సుమారు 3.25 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. భూ కేటాయింపులు పూర్తయిన వెంటనే నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు విడుదల చేస్తామని పర్యాటక శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

ఎంపికైన బీచ్‌లు ఇవే..

చిల్లకూరు మండలంలోని తీగపాళెం, కోట మండలం శ్రీనివాససత్రం, వాకాడు మండలంలోని తూపిలిపాళెం, ఓడపాళెం, (లైట్ హౌస్), వైట్ కుప్పం, పూడి కుప్పం, శ్రీనివాసపురం, నవాబుపేట బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు అధికారులు ఎంపిక చేశారు. ఈ ప్రాంతాలు ఇప్పటికే పర్యాటకులతో నిత్యం సందడిగా ఉంటాయి. అతిథిగృహాలు, జల విహారానికి బోట్లు, ఇతర వసతులు సమకూరిస్తే మరింతగా ఆకట్టుకునే అవకాశముంటుంది. ప్రస్తుతం నవాబుపేటలో జెట్టి ఏర్పాటు చేస్తున్నారు. 50 సెంట్ల భూమిని సైతం కేటాయించారు.



వాకాడు మండలం తూపిలి పాళెం వద్ద స్థల పరిశీలనలో జేసీ బాలాజీ, ఆర్డీఓ కిరణ్‌కుమార్ (ఫైల్)



తీర ప్రాంతంలో వసతుల కల్పనకు అవకాశాలను పరిశీలిస్తున్న టూరిజం, మత్స్యశాఖ అధికారులు

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

సముద్ర తీరం వెంబడి ఇప్పటికే 8 బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో భూములు కేటాయించాలని రెవెన్యూశాఖను కోరాం. వారు భూములు అప్పగించిన అనంతరం నిధులు విడుదల చేస్తాం. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు బీచ్‌లను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాం. – రూపేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా పర్యాటకశాఖాధికారి, తిరుపతి

వసతులు కల్పిస్తే చాలు



చిల్లకూరు మండలంలోని తీగపాళెం బీచ్‌కు ప్రతి ఆదివారం పర్యాటల తాకిడి అధికంగా ఉంటుంది. తూర్పు కనుపూరులో ముత్యాలమ్మను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు బీచ్ వద్దకు వెళ్లి పుణ్యస్నానాలు చేస్తుంటారు. తీర ప్రాంతానికి వెళ్లేందుకు రోడ్డు నిర్మించడంతో పాటు మరిన్ని వసతులు కల్పిస్తే చాలు.. పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశముంటుంది.

– శ్రీనివాసులు, మోమిడి, చిల్లకూరు మండలం

అభివృద్ధికి అవకాశం



వాకాడు మండలంలోని తూపిలిపాళెం బీచ్ వద్ద సముద్రం తీర ప్రాంతం లోతు తక్కువ ఉంటుంది. అందుకే పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో తరలి వస్తుంటారు. గతంలో ఇక్కడ అతిథిగృహం ఉండేది. నిర్వహణలోపంతో శిథిలావస్థకు చేరింది. ఈ ప్రాంతం అభివృద్ధికి అనుకూలంగా ఉంటుంది. వసతులు కల్పిస్తే నిత్యం పర్యాటలకులతో కళకళలాడుతుంది.

– సోమయ్య, వాకాడు మండలం తూపిలిపాళెం

ఆనందంగా ఉంది



తూపిలిపాళెం అభివృద్ధికి అనువుగా ఉంటుంది. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సన్నద్ధం కావడం ఆనందంగా ఉంది. ఇక్కడ వసతులు కల్పిస్తే చుట్టు పక్కల గ్రామాలు కూడా అభివృద్ధి దిశగా పయనిస్తాయి. స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అధికారులు సైతం అన్ని విధాలుగా ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందని నిర్ణయించారు.

– వీవీ రమణయ్య, వైస్ ఎంపీపీ, తూపిలిపాళెం

ముస్లింలతో వైఎస్సార్‌సీపీకి మరింత బలం



పుంగనూరులో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ ముస్లిం మైనారిటీలతో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పులిచెర్ల టీడీపీ నాయకులు

పుంగనూరు: ముస్లిం మైనారిటీలు వైఎస్సార్ సీపీలోకి పెద్ద ఎత్తున చేరుతుండడంతో పార్టీ మరింత బలోపేతం అవుతోందని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 100 మందికి పైగా తెలుగుదేశం ముస్లిం కార్యకర్తలు ఆదివారం నాయకుడు అస్లాంమురాధి ఆధ్వర్యంలో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లింలు మహమ్మద్, మన్సూర్, రిజ్వాన్, ఉస్మాన్, ఫరాజ్, అసిఫ్, నయాజ్, మున్నా, నూర్ మహమ్మద్, మహమ్మద్‌వారీస్, ఎంఎస్.వసీమ్, సుహేల్‌మాలిక్ తదితరులకు మంత్రి పెద్దిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మైనారిటీలు అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరుతుండం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్ము, మైనారిటీ సెల్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ ఫకృద్దీన్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పులిచెర్ల టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలోకి..

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో ఆదివారం పులిచెర్లకు చెందిన టీడీపీ నాయకులు వెంకటనారాయణరెడ్డి, చిన్నబ్బ వారి అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, ప్రభాకర్, గోవర్ధన్, రమణారెడ్డి, రవీంద్రారెడ్డి, నాగిరెడ్డి, శ్రీధర్, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైభవం.. ఇంద్రవరదుని రథోత్సవం



రథంలో విశేషాలంకరణలో స్వామి,అమ్మవారు

యాదమరి: మండల కేంద్రంలోని త్రివేణి సంఘమంలో వెలసిన శ్రీఇంద్ర వరదరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం కల్యాణ వేదిక్పై శ్రీదేవి,భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. తదుపరి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సమూర్తులను రథంలో కొలువు తీర్చారు. అనంతరం రథోత్సవం పురవీధులలో ఊరేగింపు ప్రారంభించారు. రథోత్సవం ప్రారంభమైంది. రెండు వీధులు పూర్తయిన సమయంలో హోరుగాలి, ఉరుములు, మెరుపులతో వాన కురిసినా భక్తులు పక్కకు వెళ్లకుండా గోవింద నామస్మరణలు ఆలపిస్తూ రథాన్ని ముందుకు లాగారు.



రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తులు

వైభవంగా మెట్లోత్సవం

రాత్రి ఉత్సవమూర్తులకు మెట్లోత్సవం వేడుకగా నిర్వహించారు. అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తు ఊయల ఊపుతు మెట్ల ఉత్సవం నిర్వహించారు. అనంతరం తోటోత్సవం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అశ్వవాహనంపై స్వామివారు విహరించనున్నారు. ఉదయం అలంకార అభిషేకం, సాయంత్రం వెణ్ణాత్తాయ్ కణ్ణన్ తిరుక్కోలం కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఇంటి విద్యుత్‌కు రెక్కలు

భానుడు భగభగమంటున్నాడు...బయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాలో విద్యుత్ వాడకం అమాంతం పెరిగింది. వేసవితాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు విపరీతంగా వాడుతున్నారు. విద్యుత్ పరికరాలు ఆగకుండా పరిగెడుతుండడంతో మీటర్ గిర్రున తిరుగుతూ రికార్డు స్థాయిలో విద్యుత్ వాడకం పెరుగుతోంది. స్వీయ నియంత్రణ పాటించాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

- రికార్డు స్థాయిలో విద్యుత్ వాడకం
- గత సంవత్సరం కంటే కోటి యూనిట్లు అధికం
- 24 గంటలూ తిరుగుతున్న ఫ్యాన్లు, ఏసీలు
- లోడ్ బ్యాలెన్సింగ్‌కు ట్రాన్స్‌కో ప్రత్యేక చర్యలు



గత ఏడాది మే నెల	యూనిట్లు ఎంయూ	ఈ ఏడాది మే నెల	యూనిట్లు ఎంయూ
15	15.41	15	24.31
16	15.08	16	25.20
17	15.07	17	24.46
18	15.45	18	24.77
19	14.85	19	24.50
20	15.10	20	24.47
21	15.13	21	22.52
22	16.03	22	22.83
23	18.30	23	22.64
24	22.37	24	23.22
25	22.37	25	22.67
26	22.45	26	23.56
27	22.56	27	22.80

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా కరెంటు వినియోగం పెరిగింది. ఏసీల వినియోగం గతంలో కంటే ఎక్కువగా పెరగడంతోనే కరెంటు వాడకం పెరిగిందని అధికారులు అంటున్నారు. పీక్‌లోడ్ సమయాల్లోనే విద్యుత్‌ను భారీగా వినియోగిస్తుండడంతో కూడా లోడ్ బ్యాలెన్సింగ్ సమస్య పలు ఫీడర్లలో కనిపిస్తోంది. జిల్లాలో వేసవి కాలం డిమాండ్, సరఫరాలను దృష్టిలో ఉంచుకుని ఆయా డివిజన్ల ఈఈల పర్యవేక్షణలో పలు ప్రాంతాల్లో వినియోగ స్థాయిని బట్టి లోడ్ బ్యాలెన్సింగ్ పనులు చేపడుతోంది. జిల్లాలో అత్యధిక విద్యుత్ వినియోగం (ఓవర్‌లోడ్) కలిగిన ఫీడర్లను గుర్తించి సమీపంలో ఉండే వేరే ఫీడర్లకు బదలాయిస్తున్నారు. లోడ్ బ్యాలెన్సింగ్ కోసం కొత్త ఫీడర్లు, లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏసీల వినియోగం భారీగా పెరిగిపోవడంతో విద్యుత్ డిమాండ్ కంటే వినియోగం 30–40 శాతం పెరిగినట్లుగా అంచనాలున్నాయి. ఏసీలను 24 డిగ్రీల్లో పెట్టుకుని వినియోగిస్తే బిల్లు తక్కువగా వస్తుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

నిరంతర సరఫరా

విద్యుత్ వినియోగం పెరిగినా ఎక్కడా కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసు కుంటున్నారు. నిరంతరం విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నారు. గత పాలనలో ప్రతి వేసవిలో అత్యవసర లోడ్ రిలీఫ్ పేరిట రోజు రెండు గంటలకు పైగా విద్యుత్ కోతలతో ప్రజలు నరకం చూసేవారు. ప్రస్తుతం పెరుగుతున్న వినియోగానికి తగ్గట్లు ఉత్పత్తికి ఢోకా లేకపోవడంతో కోతల ఊసేలేదు. నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. లోపాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు.

స్వీయ నియంత్రణ అవసరం



వేసవి కాలంలో జిల్లాలో విద్యుత్ వినియోగం గతంలో కంటే భారీగా పెరిగింది. సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నాం. అనవసరంగా విద్యుత్‌ను వినియోగించకుండా స్వీయ నియంత్రణ పాటించాలి. ముఖ్యంగా ఏసీల వినియోగం భారీగా పెరగడంతో విద్యుత్ వినియోగం ఎక్కువ అయింది. – కృష్ణారెడ్డి, ఎస్‌ఈ ట్రాన్స్‌కో

23 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర వ్యాప్తంగా 112 మంది ఈఓపీఆర్డీలు, పంచాయతీరాజ్ ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 23 మందికి పదోన్నతి లభించింది. ఏఓ కేటరిలో నాగరాజు(పీలేరు), మహేష్(వి.కోట), గుణశేఖర్‌రెడ్డి(చంద్రగిరి ఎమ్మెల్యే ఓఎస్‌డీ), కర్నూలు జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న విజయ, బాలాజీ(జెడ్పీ కార్యాలయం, పీఎంఆర్ ప్రభాకర్(రామసముద్ర), శేషగిరిరావు(నగరి), భానుమూర్తిరావు (సదుం), సురేష్‌బాబు(చౌడేపల్లె), భాస్కర్(పెద్దపంజాణి), చలపతిరెడ్డి(చిత్తూరు పీఐయూ),తాజ్‌మసూర్(నిమ్మనపల్లె), ప్రేమ్ రాజ్‌కుమార్(శ్రీకాళహస్తి)ఉన్నారు. ఈఓపీఆర్డీల పరంగా లీలామాధవి(నిమ్మనపల్లె), అబ్దుల్ కలాంఆజాద్(వాయల్పాడు), చలపతిరావు(రామస ముద్రం), తిరుపతి జిల్లా నుంచి రాజశేఖర్, శ్రీనివాసరావు ఉన్నారు. ఉద్యోగన్నతి కల్పించినందుకు మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులకు ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎంఆర్ ప్రభాకర్ ఆదివారం ఒక్రపకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఇంటి వద్దే కూల్‌గా..
చిల్ అవుదాం

జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 42 డిగ్రీలు నమోదవుతోంది. ఉష్ణతాపాన్ని తీర్చే శీతల పానీయాలు, ఫ్రూట్ జ్యూస్‌లకు గిరాకీ ఏర్పడింది. కొబ్బరి బోండాలు మినహా వీధి దుకాణాలు, జ్యూస్ సెంటర్లలో అపరిశుభ్ర పండ్ల రసాలు, లస్సీ, ఇతర పానీయాలు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. 90 శాతం మంది వ్యాపారులు కలుషిత నీటితో తయారు చేసిన ఐస్‌ను వినియోగిస్తున్నారని, ఇది కలిపిన జ్యూస్‌లు తాగితే అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంట్లోనే చిల్ అయ్యేందుకు కొన్ని రకాలైన పానీయాలు తయారు చేసుకోవచ్చునంటున్నారు. ఇవి ఆరోగ్యానికి మేలుచేయడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతుందని చెబుతున్నారు...అవేవో చూద్దాం...

- అనారోగ్యం కొనితెచ్చుకోవద్దు
- ఉమ్మడి జిల్లాలో మండే ఎండలు
- సుమారు 25 వేల కూల్‌డ్రింక్స్ దుకాణాలు
- 15 వేల వరకు వీధి వ్యాపారాలే
- శుభ్రతలేని జ్యూస్‌లు తాగితే అనారోగ్యమంటున్న వైద్య నిపుణులు
- ఇంట్లోనే తయారు చేసుకోవాలని సూచన

సాక్షి తిరుపతి/చిత్తూరు రూరల్ : వేసవి వచ్చిందంటే చాలా మంది చల్లని పానీయాలను ఆస్వాదిస్తారు. పలువురు రోడ్డు సైడ్ వైపు వాలిపోతుంటారు. అక్కడ కలరింగ్‌లు ఇచ్చే పానీయాలకు ఆకర్షితులవుతుంటారు. చల్లగా ఉందంటూ తెగ తాగేస్తుంటారు. ఇదే అవకాశంగా సీజనల్ దుకాణాలు కూడా భారీగా వెలుస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేల కూల్‌డింగ్స్, ఐస్‌క్రీమ్‌ల దుకాణాలు ఉన్నాయి. ఇందులో 15 వేల వరకు రోడ్‌సైడ్ వ్యాపారాలే ఉంటాయని అధికారిక గణాంకాలు. ఈ షాపుల వద్ద క్యూ కడుతున్నారు.



చాలా మంది వీధి వ్యాపారులు, జ్యూస్ సెంటర్ల నిర్వాహకులు సరైన పరిశుభ్రత పాటించకుండా పండ్ల రసాలు, లస్సీ, నిమ్మరసం, సోడా తదితర పానీయాలను తయారు చేసి విక్రయిస్తుంటారు. వాటిల్లో వినియోగించే రసాయన పదార్థాల వల్ల ఫుడ్ పాయిజన్ అయ్యే ప్రమాదం లేకపోలేదంటున్నారు వైద్యులు. ఒక పక్క ఎండల తీవ్రతతో శరీరం నిర్జలీకరణకు గురవుతుండగా, మరో పక్క రంగుల పొడర్లు, రుచికరమైన మిశ్రమ పదార్థాలు, ద్రావణాల ఈ మిశ్రమంతో కూడిన శీత పానీయాలను తీసుకోవడం వల్ల డయేరియాకు గురై, తీవ్ర అనారోగ్యం బారినపడే అవకాశాలున్నట్లు హెచ్చరిస్తున్నారు.

కలుషిత జ్యూస్‌లతో సమస్యలు ఇలా...

కలుషిత నీటితో తయారు చేసిన ఐస్‌ను తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. 90 శాతం మంది వ్యాపారులు ప్రమాదకరమైన ఐస్‌ను వినియోగిస్తున్నారు. అందులో ఉండే సూక్ష్మక్రిముల వల్ల నీళ్ల విరేచనాలు అవుతాయి. బ్యాక్టీరియా వల్ల పారా టైఫాయిడ్, కలరా, వైరస్ వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు వేధిస్తాయి. ఇంకా పచ్చకామెర్లు, నారకురుపు, రక్తహీనత వంటి వ్యాధుల బారినపడే అవకాశముంది. ఆమ్లం, క్షారం ఎక్కువగా ఉంటే గ్యాస్ట్రిక్ ఇరిటేషన్, ఎసిడిటీ సమస్యలు, కంటి, చర్మ, ముక్కు సంబంధిత సమస్యలు, గొంతు ఇన్ఫెక్షన్లు, థైరాయిడ్, సైనసైటిస్, జలుబు వంటివి కూడా వస్తాయి. నీటిలో రసాయనాలు ఉంటే దీర్ఘకాలిక వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశముంది. ఐస్‌కు వినియోగించే నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉంటే ఫ్లోరోసిస్ (ఎముకలు గుల్ల బారడం), నైట్రేట్ ఎక్కువగా ఉంటే నీలి రంగులోకి మారడం, మాంగనీసు ఎక్కువగా ఉంటే మెదడు వాపు వ్యాధి, ఆర్సినిక్ ఉంటే కేన్సర్లు, శ్వాసకోశ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇలా తయారు చేసుకుందాం...



వేసవిలో నిమ్మకాయ నీరు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇందులో ఫైబర్ ఉంటుంది, చల్లదనంతోపాటు, జీర్ణక్రియను బాగా ఉంచుతుంది. విటమిన్–సిని కలిగి ఉండడంతో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఉష్ణతాపాన్ని తగ్గించడంలో ఇది బాగా దోహదం చేస్తుంది.



మామిడి రసం వేడి నుంచి ఉపశమనం అందిస్తుంది. రోగనిరోధక శక్తిని బలపరిచే విటమిన్–సి పుష్కలంగా లభిస్తుంది. మామిడి రసంలో యాలకుల పొడి, రుచికి కాస్త పటిక బెల్లం కలిపి తీసుకుంటే చాలా రుచిగా కూడా ఉంటుంది. ఆరోగ్యానికి మేలు కలిస్తుంది.



శరీరం హైడ్రేట్‌గా ఉంచాలంటే కొబ్బరి నీరును తప్పనిసరిగా తీసుకోవాలి. కొబ్బరి నీళ్ల తాగడం వల్ల జీర్ణవ్యవస్థ బాగా పని చేస్తోంది. కొబ్బరి నీళ్లలో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. ఈ ఫలితంగా ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. విటమిన్ సి, మెగ్నీషియం, పొటాషియం రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి.



లస్సీ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అందులో పుదీనా లస్సీ కడుపును చల్లగా ఉంచుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్, విటమిన్లు ఏ, సీ, ఈ ఉన్నాయి. ఇవన్నీ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. పెరుగులో శరీరానికి మేలు చేసే ప్రో–బయోటిక్స్ ఉంటాయి. ఇలా తీసుకోవడం వల్ల వడదెబ్బ, వేసవి తాపం నుంచి బయట పడవచ్చు.



వేడిని అధిగమించడానికి పుచ్చకాయ జ్యూస్ కూడా తాగవచ్చు. ఇది రుచికరంగా ఉంటుంది. ఆరోగ్యకరమైంది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఈరసంలో కొంత నల్ల ఉప్పుతో పాటు చక్కెర కలపి తీసుకోవచ్చు. పుదీనాను జోడించవచ్చు.

జాగ్రత్తలు పాటించాలి

వేసవిలో బయటకు వెళ్లినప్పుడు వెంట తాగునీటి బాటల్ తీసుకెళ్లడం ఉత్తమం. వీధులపై విక్రయించే చల్లటి పానియాలు, జ్యూస్‌లు వంటి వాటికి దూరంగా ఉండాలి. ఎండలో తిరిగి వచ్చిన వెంటనే ఒక్కసారిగా చల్లటి నీరు తాగడం గాని, కూల్‌డ్రింక్స్, జ్యూస్‌లు, ఇతర చల్లటి పదార్థాలను తీసుకున్నా గొంతు నొప్పి వస్తుంది. ఇంట్లోనే కొన్ని స్వచ్ఛమైన పానీయాలను తీసుకోవడం ఉత్తమం.

-డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

శుభ్రమైన పండ్లరసాలే తీసుకోవాలి

ఎండలో తిరిగి వచ్చిన వెంటనే నీరు, ఇతర చల్లటి పదార్థాలేవి కూడా తీసుకోవద్దు. బయట తిరిగి వచ్చిన వెంటనే కొద్దిసేపు నీడలో సేదతీరాలి. దీని వల్ల శరీరం చల్లబడుతుంది. ఆతర్వాత స్వచ్ఛమైన నీరు తాగాలి. ముఖ్యంగా కొబ్బరినీళ్లు, ఇంట్లోనే, పరిశుభ్రమైన దుకాణాల్లో చేసిన పండ్ల రసాలు తీసుకోవడం మంచిది. కూల్‌డ్రింగ్స్, ఓపెన్‌గా తయారు చేసే రసాలకు దూరంగా ఉండడం మంచిది. చిన్న పిల్లలు, విషయంలో జాగ్రత్త వహించాలి.

-డాక్టర్ హర్షవర్ధన్, తిరుపతి



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,600
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

ఎస్వీ సంగీత కళాశాలలో పార్ట్‌టైమ్ కోర్సులకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్ : ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో పార్ట్‌టైమ్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ తెలిపింది. సాయంత్రం కళాశాలలో గాత్రం, వీణ, వేణువు, మృదంగం, వయోలిన్, భరతనాట్యం, కూచిపూడి, హరికథ, ఘటం విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఇందులో సర్టిఫికెట్ కోర్సుకు 5వ తరగతి ఉత్తీర్ణులై జూన్ 30వ తేదీ నాటికి 10 ఏళ్ల వయసు నిండినవారు అర్హులని వివరించింది. వీరు రూ.2వేల ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే డిప్లొమా కోర్సుకు సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులై 14 ఏళ్ల వయసు నిండి ఉండాలని, వీరు రూ.2,200 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. కళా ప్రవేశిక కోర్సుకు 8 ఏళ్ల వయసు నిండి ఉండాలని, వీరు రూ.1,500లు ఫీజు చెల్లించాలని సూచించింది. ఆసక్తి గలవారు కార్యాలయ పనివేళల్లో రూ.50లు చెల్లించి దరఖాస్తు పొందవచ్చని స్పష్టం చేసింది. జూన్ 20వ తేదీలోపు దరఖాస్తు సమర్పించాలని కోరింది.. వివరాలకు 0877–2264597, 9848374408, 9440793205 నంబర్లలో సంప్రదించాలని పేర్కొంది.

నెమలికి నేర్పిన నడకలివి..



కూచిపూడి నృత్యప్రదర్శన

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆస్థాన మండపంలో ఆదివారం చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను రంజింపజేశాయి. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఉదయం బైరెడ్డిపల్లెకు చెందిన కళాతరంగిణి సంస్థ కళాకారులు లయబద్ధంగా చేసిన భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు కట్టిపడేశాయి. కళాకారులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి ప్రశంసా పత్రాలు అందించారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లాతో పాటు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ఏటీఎం కార్డును మార్చి బాధితుల వద్ద నుంచి నగదును అపహరిస్తున్న అంతర్‌జిల్లా దొంగ కొర్రా శ్రీకాంత్‌ను కడప వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ వెల్లడించారు. ఆదివారం రాత్రి కడప డీఎస్పీ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.శ్రీకాంత్ అనంతపురం జిల్లా తనకల్లు మండలం ఏనుగుండ్ల తండా గ్రామానికి చెందిన వ్యక్తి అన్నారు. నిందితుడి వద్ద నుంచి 27.5 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ. లక్ష నగదును, మోటార్‌సైకిల్‌ను, 24 ఏటిఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రెండున్నర లక్షల మేరకు ఉంటుందన్నారు. నిందితుడిపై ఇప్పటికే గుత్తి, మదనపల్లి, అలిపిరి, అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లలో కేసులున్నాయన్నారు.ఏటీఎం సెంటర్ల వద్ద అమాయకులైన ప్రజలను, ప్రధానంగా వృద్ధులను టార్గెట్ చేస్తాడన్నారు. బాధితుల వద్ద నుంచి ఏటీఎం కార్డులను ఏమార్చి వారికి తన వద్ద ఉన్న ఏటీఎం కార్డును ఇస్తాడన్నారు. బాధితుల కార్డులను ఉపయోగించి వారి ఖాతాల్లోని నగదును ఎంచక్కా కాజేస్తాడన్నారు. ఇటీవలి కాలంలో కడప వన్‌టౌన్‌లో రెండు కేసులు, ప్రొద్దుటూరు టూటౌన్, నెల్లూరు వన్‌టౌన్, శ్రీకాళహస్తి వన్‌టౌన్, చంద్రగిరి పోలీస్‌స్టేషన్ లలో ఒక్కొక్క కేసు ఉందని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్‌ఐలు మల్లయ్య, శ్రీను, క్రైమ్ పార్టీ హెడ్‌కానిస్టేబుల్ పాకా వరప్రసాద్, కానిస్టేబుళ్లు కిరణ్, నారాయణ రెడ్డి,బాష, ఖాదర్‌లకు డీఎస్పీ నగదు రివార్డులను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

రొంపిచెర్ల: రొంపిచెర్ల– పీలేరు రోడ్డులోని మట్లోళ్లపల్లె వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరుగా తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. బొమ్మ య్యగారిపల్లె పంచాయతీ ఫజులుపేట, సర్వర్‌పేట గ్రామాలకు చెందిన ముగ్గురు రొంపిచెర్ల నుంచి ద్విచక్ర వాహనంలో పీలేరుకు వెళ్లుతుండగా మట్లోళ్లపల్లె వద్ద అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో ఫజులుపేటకు చెందిన జావిద్(22) అక్కడికక్కడే మృతి చెందాడు. సర్వర్‌పేటకు చెందిన సల్మాన్(19), ఫజులుపేటకు చెందిన గణేష్ (18) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్త పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీ పాళెం ఎస్టీ కాలనీలో శనివారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందాడు. భాకరాపేట ఎస్ఐ ప్రకాష్‌కుమార్ కథనం మేరకు.. ఎస్టీ కాలనీకి చెందిన రేణుక ఇంటికి ఆమె అక్క కుమారుడు పులిచెర్ల మండలం పేరసానివారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన హేమంత్ (15) వారం క్రితం వచ్చాడు. శనివారం సాయంత్రం చిన్నాన్న నాగరాజా, చిన్నమ్మ రేణుకతో కలసి అడవికి వెళ్లాడు. పాళెం అటవీ సమీపంలోని రెడ్డి చెరువు వద్ద విద్యుత్ తీగలపై కూర్చున్న గువ్వలను కొట్టేందుకు క్యాటర్‌బాల్ తో రాయి విసిరాడు. దీంతో విద్యుత్ తీగ తెగి మీద పడడంతో హేమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో నాగరాజా, రేణుక భయంతో బాలుడి మృత దేహాన్ని పక్కనే ఉన్న బండపై పెట్టి ఇంటికి వచ్చేశారు. అడవికి వెళ్లిన తన అక్క కుమారుడు తిరిగి రాలేదని గ్రామంలో చెప్పారు. . గ్రామస్తులు ఆదివారం బాలుడిని వెతుక్కుంటూ వెళ్లగా హేమంత్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. కాళ్లు, వీపుపై కాలిన గాయాలు ఉండడంతో నాగరాజా, రేణుకను విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రథంపై శివపార్వతుల కటాక్షం



రథంపై విహరిస్తున్న శివపార్వతులు

పుత్తూరు రూరల్: పుత్తూరులోని ప్రముఖ శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శివపార్వతులు రథాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి రథంపై ఆశీనులను చేశారు. మహిళల కోలాట నృత్యాలు, మేళతాళాలు, ప్రత్యేక వాయిద్యాల నడుమ పురవీధుల్లో రథంపై స్వామి, అమ్మవార్లు విహరించారు. ఇంటింటి వద్ద భక్తులు కర్పూర హారతులిచ్చారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయం విద్యుత్ దీప కాంతులతో అలరాలుతోంది. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్‌బాబు పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీలోకి 15 టీడీపీ కుటుంబాలు



ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు

గంగవరం: మండలంలోని దండపల్లి పంచాయతీ వేమనపల్లెలో టీడీపీకి చెందిన 15 కుటుంబాల వారు ఆదివారం పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన వెంకటరమణ, కనకరాజు, సుబ్రమణ్యం, దాము, వసంత కుమార్, సుబ్రమణ్యం, వెంకటేష్, ప్రసాద్, నాగరాజు, దండపల్లె గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, ఎల్లప్ప, మరో మూడు కుటుంబాల వారు దాదాపు 30 మందికి పైగా టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గత టీడీపీ ప్రభుత్వంలో తమకు ఒరిగిందేమి లేదని, జగనన్న ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు జరుగుతున్న మంచిని చూసి టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ బీరుగౌడు, ఎంపీటీసీ సభ్యుడు జయచంద్ర, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బట్టలు ఉతికేందుకు వెళ్లి..

- చెరువులో పడి డ్రైవర్ మృతి
- భార్య కళ్ల ఎదుటే ఘటన



చెరువు నుంచి వెలికి తీసిన శ్రీనివాసులు మృతదేహం

కుప్పం: భార్యతో కలసి చెరువు వద్ద బట్టలు ఉతికేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి నీళ్లలో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. శాంతిపురం మండలం బోయనపల్లెకు చెందిన శ్రీనివాసులు శాంతిపురం రాయల్ స్కూల్‌లో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కుప్పం ఎన్‌టీఆర్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటూ భార్య భవాని, ఇద్దరు కుమారులను పోషించుకుంటున్నాడు. ఆదివారం ఉదయం భార్యతో కలసి డీకేపల్లె చెరువు వద్దకు బట్టలు ఉతికేందుకు వెళ్లాడు. బట్టలు ఉతుకుతుండగా సబ్బు చెరువు పడిపోయింది. దాన్ని తీసేందుకు శ్రీనివాసులు నీళ్లలో దిగాడు. కొద్దిగా లోపలికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీళ్లలో మునిగిపోయాడు. దీంతో భార్య గట్టిగా కేకలు వేసింది. చుట్టపక్కల వారు వచ్చి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడి చేరుకున్నారు. చెరువులో నుంచి శ్రీనివాసులును వెలికి తెచ్చారు. అప్పటికే ఆయన మృతి చెంది ఉన్నాడు. కళ్ల ముందే భర్త చెరువులో పడి మృతి చెందడంతో భార్య భవాని కన్నీరుమున్నీరైంది.

అనుమానాస్పద స్థితిలో ట్రావెల్స్ యజమాని మృతి

- అంత్యక్రియల సమయంలో శవంపై బయటపడిన గాయాలు
- ఆపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

పూతలపట్టు: పూతలపట్టు మండలం గొడుగు చింతకు చెందిన నీరుగట్టు శంకర్(43) ఆదివారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు శంకర్ తిరుపతి జీవకోనలో నివాసం ఉంటున్నాడు. సన్నిధి పేరుతో ట్రావెల్స్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం రెండు గంటలకు గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులు, మిత్రులు కలిసి స్విమ్స్‌లో చేర్పించారు. సాయంత్రం చనిపోయినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతదేహాన్ని వెంటనే స్వగ్రామమైన గొడుగుచింతకు తరలించారు. అనంతరం అంత్యక్రియలకు సిద్ధం చేస్తుండగా చాతిపై రక్త గాయాలు కనిపించడంతో భార్య శిరీషకు అనుమానం వచ్చింది. వెంటనే అంత్యక్రియలను ఆపేసి భర్త మృతదేహంతో తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని ఫిర్యాదు చేసింది. ఆదివారం ఉదయం పోస్టుమార్టమ్‌కు పంపుతామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్విమ్స్‌కు తరలించారు. మృతుడికి ప్రమోద్, వినోద్ ఇద్దరు కుమారులు ఉన్నారు